రెగ్యులర్ సిడిపిఒను నియమించాలి

ప్రజాశక్తి-కడపఅర్బన్ : కడప అర్బన్‌కు రెగ్యులర్ సిడిపిఒను వెంటనే నియమించాలని సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రారెడ్డి, పి.వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ కడప నగరం ఐసిడిఎస్ పరిధిలో జిల్లాలో ఉండే అన్ని ప్రాజెక్టుల కన్నా కడప ప్రాజెక్టు పెద్దదని తెలిపారు. ముందున్న సిడిపిఒకు స్థాయి తగ్గించి సత్యసాయి జిల్లాకు బదిలీ చేశారన్నారు. ఇప్పుడు అసిస్టెంట్ సిడిపిఒ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఐసిడిఎస్‌లో సెంటర్ అద్దెలు, పోషు సామాన్ల బిల్లులు సంబంధించిన బడ్జెట్ వచ్చి ఉందని పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ లోపల ఈ బడ్జెట్‌ను వినియోగించుకోకుండా ఉంటే ఆ డబ్బు తిరిగి వెళ్లిపోతుందని తెలిపారు. ఇప్పుడున్న అసిస్టెంట్ సిడిపిఒకి తంబ్ పర్మిషన్ అయినా ఇవ్వాలి, లేదంటే కొత్త సిడిపిఒనైనా ఏర్పాటు చేసి అంగన్‌వాడీలకు రావాల్సిన ఇంటి అద్దెలు, పోషు సామాన్ల బిల్లులు సంబంధించిన మొత్తాన్ని చేజారకుండా చూడాలని డిమాండ్ చేశారు.

మొక్కుబడిగా జడ్‌పి స్టాండింగ్ కమిటీ సమావేశం

- సంక్షేమ పథకాల అమలుపై ప్రశ్నాస్త్రాలు
- బెడెడ్ రోగుల పింఛన్ల సర్వేపై నిలదీత
- పలువురు జడ్‌పిటిసిలు గైర్హాజర్..నిరీక్షణ

మాట్లాడుతున్న జడ్‌పి సిఇఒ ఓబులమ్మ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు మొక్కుబడిని తలపించాయి. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ హాలు, డిపిఆర్‌సి హాలుల్లో జడ్‌పి సిఇఒ సి.ఓబులమ్మ, డిప్యూటీ సిఇఒ మైథిలి అధ్యక్షతన నిర్వహించారు. మొదటగా పోరుమామిళ్ల జడ్‌పిటిసి చెన్నయ్య జిల్లాలో పంచాయతీ రాజ్ రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయని, ప్రతి సమావేశంలో ప్రస్తావనకు వస్తున్నప్పటికీ ఎటువంటి స్పందన లేకుండా పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరాలసిస్ తదితర బెడెడ్ రోగుల పింఛన్లపై సర్వే ఉద్దేశం ఏమిటో తెలియజేయాలని నిలదీశారు. పెరాలసిస్ రోగులు ప్రారంభదశలో మెరుగైన వైద్యం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడి ఉంటుందని, అటువంటి రోగుల పింఛన్ ఇప్పుడు తొలగించడం ఏమిటని నిలదీశారు. జిల్లాలో వేలాది మంది పింఛన్ల తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. డిఆర్‌డిఎ పీడీ స్పందిస్తూ రాష్ట్రంలో 15 వేల వరకు బెడెడ్ రోగులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించిందని, ఆమేరకు జిల్లాలోనూ బెడెడ్ రోగులపై సర్వే మాత్రమే చేపట్టాలని ఆదేశించిందని, బెడెడ్ రోగులు ఆరోగ్యం మెరుగుపడి ఉంటే వైద్య నిపుణుల సిఫారసు మేరకు వ్యాధి తీవ్రత ఆధారంగా వైద్యులు ఇచ్చే సిఫారసుల ఆధారంగా పింఛన్ తగ్గించడమా, తొలగించడమా అనేది ఉంటుందని తెలిపారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల ఫిర్యాదు మేరకు జిల్లాలో 3,400 అక్రమ పింఛన్లపై విచారణ చేపట్టామని తెలిపారు. ఉపాధి హామీ పనులకు వెళ్తున్న వారికి డిజేబుల్ పింఛన్లు ఉన్నట్లు గుర్తించామని, అటువంటి పింఛన్లు తొలగింపునకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం అక్రమ పింఛన్ల తొలగింపుపై ఎనిమిది మంది మంత్రులతో కమిటీ వేసిందని, కమిటీ సిఫారసుల ఆధారంగా చర్యలు ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. ఖాజీపేటకు చెందిన జడ్‌పి కో-ఆప్షన్ సభ్యులు కరీముల్లా మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల ద్వారా శ్మశానాలు అభివృద్ధి పరచాలని డిమాండ్ చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ యంత్రాంగం వేసవి సీజన్ రానున్న నేపథ్యంలో సిపిడబ్ల్యు స్కీముల పనితీరు మెరుగు పరచాలని జడ్‌పి సిఇఒ సి.ఓబులమ్మ ఆదేశించారు. జడ్‌పి సమావేశ హాలు సమావేశానికి హాజరు కావాల్సిన ముగ్గురు జడ్‌పిటిసిలు గైర్హాజరయ్యారు. డిపిఆర్‌సి సమావేశానికి హాజరు కావాల్సిన జడ్‌పిటిసిలు గైర్హాజర్ కావడంతో కొంతసేపు నిరీక్షించడం గమనార్హం. ఏదేమైనా కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన పలువురు జడ్‌పిటిసిలు, జిల్లా ఉన్నతాధికారులు హాజరై మొక్కుబడిగా సమావేశం గమనార్హం.

విభజన హామీలు అమలు చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-బద్వేలు

రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి ద్రోహం చేసిన ప్రధాన మంత్రి మోడీ రాష్ట్ర పర్యటనకు రావడం సిగ్గుచేటని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని అన్నారు. బుధవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సిద్దవటం రోడ్డులోని భగత్ సింగ్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం పేరుతో రాష్ట్రానికి వచ్చిన నరేంద్ర మోడీ, రాష్ట్ర ప్రజానీకానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2014 ఎన్నికలకు ముందు విభజన హామీలను అమలు చేస్తామన్న హామీతో బాబు మోడీలు జోడి ప్రజల ముందుకు వచ్చి అధికారాన్ని కైవసం చేసుకున్న తర్వాత 11 ఏళ్లు అయినా హామీలు అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. నాడు రాజధాని శంకుస్థాపన కోసమని వచ్చి చెంబుడు నీళ్లు పిడికెడు మట్టి వేసి వెళ్లారని, హామీలు అమలు చేయకుండా ఇంకెన్నేళ్లు మోసం చేస్తారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి అప్పు ఇచ్చే స్థాయికి ఎదిగిన విశాఖ ఉక్కును సొంత గనులు కేటాయించకుండా నష్టాల్లోకి నెట్టి, ప్రయివేట్ కార్పొరేట్ల ఆదాయ వనరు కోసం ఏకంగా మూసివేతకు ప్లాన్ వేసిందన్నారు. విశాఖ ఉక్కు రక్షణ పట్ల స్పష్టత ఇవ్వాలన్నారు. వెనకబడ్డ రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్యాకేజీ కేటాయించి ప్రాజెక్టులు నిర్మించాల్సిన పాలకులు ఒక్కటంటే ఒక్కటి కూడా నిర్మించలేదన్నారు. తిరిగి నేడు కూటమి ప్రభుత్వంలో భాగంగా చంద్రబాబు మోడీలు జోడిగానే ఉన్నారని, రాష్ట్ర వెనుకబాటు తనానికి సంబంధించి చంద్రబాబు కూడా సమాధానం చెప్పాలన్నారు. రూ.142 కోట్ల జనాభా ఉన్న భారతదేశానికి రూ.165 లక్షల కోట్ల అప్పులు పెట్టి దేశాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు.

నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ నాయకులు

చేసిన అప్పు అంత ఏ అభివృద్ధి కోసం ఖర్చు చేశారో ప్రజానీకానికి సమాధానం చెప్పాలన్నారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, రాయలసీమ ముఖ ద్వారమైన కర్నూలు జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణం, వలసల నియంత్రణ లాంటి వాటిపై ద ృష్టి పెట్టకుండా మాటల గారడీ మాకొద్దని ముక్తకంఠంతో మీ రాకను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించకపోతే ప్రజలంతా ఐక్యంగా తిరగబడే రోజు మరెంతో దూరంలో లేదని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ షరీఫ్, కార్యదర్శి షేక్ ఆదిల్, పట్టణ నాయకులు సుధాకర్, ఇర్ఫాన్, హేమంత్, నాసర్, తేజ, యోగి, పృథ్వీ, నరసింహారాజు పాల్గొన్నారు.

నిరవధిక దీక్షలు చేపడతాం

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఉపాధ్యాయులను దుర్భాషలాడుతూ, గౌరవం లేకుండా మాట్లాడుతున్న ఈ డిఇఒ మాకొద్దంటూ నిరవధిక దీక్షలకు సిద్ధంగా ఉన్నామని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. కడప ఉపాధ్యాయ భవన్‌లో ఐక్యవేదిక సంఘాల నాయకులు ఈ డిఇఒమా మాకొద్దని, ఉపాధ్యాయుల ఆత్మగౌరవం కోసం ఉద్యమ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ నెల 9వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితని, ఉమ్మడి జిల్లా మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని, ఎంపీ, ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను కలిసి వినతి పత్రాలు సమర్పణ. 23, 24వ తేదీలలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రతి పాఠశాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన. 27 నుంచి 31 తేదీ వరకు డిఇఒ కార్యాలయ ముట్టడికి సన్నద్ధత. ఫిబ్రవరి 1వ తేదీన డిఇఒ కార్యాలయం ముట్టడి. 3, 4వ తేదీలలో మహాత్మా గాంధీ, డాక్టర్ అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పణ. 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు. 19న మాస్ క్యాజువల్ లీవ్, 20 తేదీ నుంచి 28 తేదీ వరకు ఆమరణ నిరాహార దీక్షలకు ఉపాధ్యాయులను సన్నద్ధత చేయుట. మార్చి 1వ తేదీ నుంచి నిరవధిక దీక్షలు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవం కోసంపై ఉద్యమ కార్యాచరణ జరిపి తీరుతామని ప్రతి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సమావేశం. అందులో ఉద్యమ తీరు తెన్నులను పునః సమీక్షించుకుని ఈ డిఇఒ ఈ జిల్లా వదిలి పెట్టేంత వరకు ఉద్యమ కార్యాచరణ కొనసాగించడం. చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మోపూరి వెంకట శివారెడ్డి, గుజ్జల తిరుపాల్, ఇలియాస్ బాషా, లెక్కల జమాల్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, అబ్దుల్లా, నరసింహారావు, రామాంజనేయులు, రాధాకృష్ణమూర్తి, రామకృష్ణంరాజు, గంగరాజు, ఆంజనేయులు, హరికొండయ్య, పీవీ సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, సాజిద్, ఆంకాల్ కొండయ్య, నరసింహా రెడ్డి, ఆవుల శ్రీనివాసులు, రమేష్ బాబు, శివశంకర్‌రెడ్డి, ప్రవీణ్, చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, రామాంజనేయరెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, పాల్గొన్నారు.

స్థానికేతరుల భూములను రద్దు చేయాలి

- వ్య.కా.స జిల్లా కార్యదర్శి అన్వేష్

తహశీల్దార్‌కు అర్జీ ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కాశినాయన

స్థానికేతరుల భూములను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్, సిపిఎం మండల కార్యదర్శి ఎం.పోలయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సావిశెట్టిపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు వందల ఎకరాల ప్రభుత్వ పట్టా భూములను నకిలీ పత్రాలతో ఆక్రమించారని వారిపై చర్యలు తీసుకొని ఆ భూములను రద్దు చేయాలని తహశీల్దార్ వెంకట సుబ్బయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు కబ్జా జరిగిన వివరాలను అందించామని తెలిపారు. మండల స్థాయి అధికారులకు విచారణ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించినప్పటికీ మండల స్థాయి అధికారులు మాత్రం నీరు గారుస్తూ వస్తున్నారని విమర్శించారు. పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు సాగు చేస్తున్న భూములను అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారని వాడికి తొలగించి సాగు చేస్తున్న వారి పేర్లపై నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు చేపట్టకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

స్వయం ప్లస్‌తో ఉద్యోగ అవకాశాలు

- వైవీయూ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

స్వయం ప్లస్ ద్వారా విద్యార్థులకు విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా విశ్వవిద్యాలయం కృషి చేస్తుందని వైవీయూ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి 'స్వయం ప్లస్' అమలు తీరు తెన్నులపై రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల విసిలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం గురించి, ఇక్కడ అమలు చేస్తున్న కోర్సుల గురించి విసి రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి నివేదించారు. విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు పరిశ్రమల్లో అవకాశాలు కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్స్ ఇన్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్మెంట్‌లో విద్యార్థులు హైదరాబాద్ స్కిల్ డిజైర్ టెక్నాలజీ ద్వారా శిక్షణ పొందుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనార్థం తాజాగా హైదరాబాద్ ఇన్నవేటివ్ సైబర్ టెక్ సంస్థతో ఎంఒయు కుదుర్చుకున్నామన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారులు ఉమామహేశ్వరి, దక్షిణామూర్తి, చెన్నై ఐఐటి నిపుణులు సారథి, అశోకులు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యార్థుల భవిష్యత్తును ఆకాంక్షిస్తూ విద్య, ఉద్యోగ అవకాశాలపై చెన్నై ఐఐటి సంస్థతో భేటీ కానున్నారని తెలిపారు. మనం మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని విశ్వవిద్యాలయాలు ఒకే మాసంలో విద్యార్థుల శిక్షణలు ప్రారంభించాలని సూచించారు. యోగివేమన విశ్వవిద్యాలయం స్వయం ప్లస్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.పి.వెంకటరమణ, జర్నలిజం అధ్యాపకులు డాక్టర్ టి.సురేష్ బాబు పాల్గొన్నారు.

వైవీయూ స్కాలర్ హేమలతకు డాక్టరేట్

ప్రజాశక్తి-కడప అర్బన్

పర్యావరణ సహిత మానవ శరీరంలో ఔషధ సరఫరా, గాయాలను త్వరితగతిన నయం చేయడానికి నానోడ్రగ్ కనుగొన్న రసాయన శాస్త్ర శాఖ స్కాలర్ డి.హేమలతకు యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు కె.ఎస్.వి.కృష్ణారావు పర్యవేక్షణలో సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ పాలి శాఖరాయిడ్ బేస్డ్ హైడ్రోజెన్స్ ఫర్ కంట్రోల్ రిలీజ్ ఆఫ్ కీమోథెరపీ ఏజెంట్స్ అండ్ యాంటీ మైక్రోబియన్ అప్లికేషన్' అనే అంశంపై పరిశోధన చేసిన సిద్ధాంత గ్రంథం విశ్వవిద్యాలయానికి సమర్పించారు. డి.హేమలతకు డాక్టరేట్ సర్టిఫికెట్‌ను వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కృష్ణారావు జారీ చేశారు. ఈమె చేసిన సిద్ధాంత అంశంపై పలు ప్రఖ్యాత అంతర్జాతీయ పబ్లికేషన్స్ ఎల్సివేర్, అమెరికన్ కెమికల్ సొసైటీ, స్ప్రింజర్ వంటి జర్నల్స్‌లో పరిశోధనా పత్రాలు, బుక్ చాప్టర్స్ ప్రచురింపబడినవి. వైవీయూ రసాయన శాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకున్న డి.హేమలతను పరిశోధన గైడ్ కృష్ణారావును విసి కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ్‌రెడ్డి, రసాయన శాస్త్ర అధ్యాపకులు అభినందించారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-అట్లూరు

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిఒ చంద్రమోహన్ చెప్పారు. ప్రభుత్వం ఈ సదస్సులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ప్రజలు ఈ సదస్సులు వినియోగించుకుని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. మండలంలోని కొండూరులో ముగింపు చివరి రోజు గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో డిసెంబర్ 6 నుంచి ఎనిమిదో తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం ద్వారా తగాదాలు తప్పిపోయి శాంతి భద్రతలు కూడా మెరుగుపడతాయన్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించే రోజున వచ్చే అర్జీలకు ఆ రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. సదస్సులో అందిన ఫిర్యాదులు 45 రోజుల లోపల పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో తహశీల్దార్ సుబ్బలక్ష్మమ్మ, సర్పంచ్ సుధా, మండల సీనియర్ నాయకులు నందగోపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, విఆర్‌ఒలు దొరబాబు, దస్తగిరి, వెంకట సుబ్బమ్మ, సర్వేయర్ సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు జైకృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణారెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య, నాయకులు బద్వేల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కాకి రిషికేశవ, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, చిన్నపరెడ్డి, డీలర్ గంగిరెడ్డి, చిలిపి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఎపిడి ఆగ్రహం

ప్రజాశక్తి-ప్రజాశక్తి

ఉపాధి హామీ సామాజిక ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఉపాధి హామీ ఎపిడి నాగరత్నమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వల్లూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీకి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2023, 2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. సామాజిక తనిఖీలలో గైహాజరైన కూలీలకు కూడా వేతనాలు ఇచ్చారని, మస్టర్లు కూలి సంతకాలు లేకుండా ఉన్నా కూడా వేతనం మంజూరు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎపిడి సోమశేఖర్‌రెడ్డి, ఎంపిడిఒ రఘురాం, డివిఒ రామలింగారెడ్డి, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ చెన్నారెడ్డి, ఎపిఒ సుధారాణి, కమలాపురం ఎపిఒ పార్థసారథి, పిఆర్ఎ విష్ణువర్ధన్‌రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు లేబాక నాగేశ్వర్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సిబిఐ జెడిని కలిసిన మిత్రులు

ప్రజాశక్తి-కడప అర్బన్

తిరుపతి నుంచి నంద్యాలలోని శాంతిరాం కళాశాల సమావేశానికి వెళుతూ మార్గమధ్యంలో ఉన్న కడపకు వచ్చిన సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణను ఆయన మిత్ర బృందం ఎర్రముక్కపల్లెలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ విలేకరులతో మాట్లాడుతూ కడప నా జన్మస్థలమని, తన తండ్రి, తాతలు కడపవారేనని చెప్పారు. మా తాత తహశీల్దారుగా కడపలో పనిచేశారని పేర్కొన్నారు. తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. చిన్ననాటి అనుభూతులను మిత్రులతో పంచుకున్నారు. రాష్ట్రం అన్నిరంగాలలో అభివృద్ధి చెందాలన్నది తన ఆశయమని, అందుకనుగుణంగా తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. సాంకేతిక, పారిశ్రామిక అభివృద్ధితో పాటు, వ్యవసాయ రంగం కూడా సమాంతరంగా అభివృద్ధి సాధిస్తే ప్రజలకు ఎంతోమేలు చేకూరుతుందని పేర్కొన్నారు. ఆ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడి చిన్ననాటి మిత్రులు పాల్గొన్నారు.

విజయవంతంగా ప్లాక్ బ్రాకీథెరపీ చికిత్స

ప్రజాశక్తి-కడప అర్బన్ : కంటి కేన్సర్ సంరక్షణలో విప్లవాత్మకంగా పేర్కొనే ఆంధ్రప్రదేశ్‌లోని మొట్టమొదటి ప్లాక్ బ్రాకీథెరపీ ప్రక్రియను విజయవాడ ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వైద్యులు విజయవంతంగా పూర్తి చేసినట్లు కడప డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రాంగణం ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వైద్యులు తెలిపారు. ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు డాక్టర్ అనసూయ గంగూలీ కపూర్, ఆమె మల్టీ డిసిప్లినరీ బృందం నిర్వహించారన్నారు. ఈ ప్రక్రియ ఒక చారిత్రాత్మక మైలురాయిగా, ఇది ఒక వినూత్న ఆవిష్కరణగా చెప్పారు. కంటి కేన్సర్ చికిత్సలో ప్లాక్ బ్రాకీథెరపీ ఒక అత్యాధునిక ప్రక్రియన్నారు. ప్లాక్ బ్రాకీథెరపీ కొరొయిడల్ మెలనోమా, కొరొయిడల్ హెమన్జియోమా, రెటినల్ వాస్క్యులర్ ట్యూమర్లు, ఇతర కంటి ఉపరితల ట్యూమర్ల వంటి ఇంట్రాఆక్యులర్ ట్యూమర్లకొరకు ప్రధానంగా ఉపయోగించబడే ఒక అధునాతన చికిత్స అన్నారు. చిన్న లేదా మధ్యస్థ పరిమాణ ఇంట్రాఆక్యులర్ ట్యూమర్లలో కంటిగోళం ఉద్ధరణ లేదా లేజర్ ఫొటోకాగ్యులేషన్ లేదా దైహిక చికిత్సలవంటి మొదటి-శ్రేణి చికిత్సలు నిరుపయోగకరమైనప్పుడు రెటినోబ్లాస్టోమా రిఫ్రాక్టరీ కేసులలో దీనిని తరచుగా ఉపయోగిస్తారని తెలిపారు. 2020 సంవత్సరంలో మొదలుపెట్టి, మౌలిక సదుపాయాలు, జట్టు అభివృద్ధితో కూడిన అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డ్ (ఎఇఆర్‌బి)కు అనుగుణంగా 4 సంవత్సరాలపాటు రూపొందించిన ప్రక్రియను అనుసరించడం ద్వారా ఈ పద్ధతిని నిర్వహించడానికి సాధ్యమైందన్నారు. స్థానిక రేడియేషన్ ఆంకాలజిస్టులు అమెరికన్ ఆంకాలజీ ఇన్స్టిట్యూట్‌కి చెందిన డాక్టర్ టి.క్రాంతి కుమార్, మణిపాల్ హాస్పిటల్‌కి చెందిన డాక్టర్ రామకృష్ణ, రేడియేషన్ ఫిజిసిస్ట్ సురేష్ తమ సహకారాన్ని అందించారన్నారు. హైదరాబాద్ అపో కేన్సర్ హాస్పిటల్‌లో రేడియేషన్ ఫిజిసిస్ట్ పద్మ గణేశన్, సీనియర్ ఆంకాలజిస్ట్ డాక్టర్ విజయ్ ఆనంద్‌రెడ్డి మార్గదర్శకత్వంలో విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

పర్యావరణమే ప్రథమ మిత్రులు

ప్రజాశక్తి-కడప అర్బన్ : ప్రతి మనిషికి పర్యావరణమే ప్రథమ మిత్రుడని ఎపి ఎన్‌జిసి ఇన్‌ఛార్జి డైరెక్టర్ శ్రవంతి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, శ్రీ సాయి కృష్ణ, శివ శివాని ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఎన్‌జిసి కార్యక్రమం తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులను ద్వేషించి పర్యావరణాన్ని పెంపొందించుటకు తీసుకోవలసిన జాగ్రత్తలు, తీసుకుంటున్న జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌జిసి ప్రాజెక్టు ఆఫీసర్ సత్యనారాయణ, కడప కో-ఆర్డినేటర్ వెంకటరమణయ్య, సమగ్ర శిక్ష కో-ఆర్డినేటర్ దశరథ రామ్‌రెడ్డి, కడప మండల వనరుల కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక కమిటీని ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-కడప అర్బన్

-టిటిడి చైర్మన్‌కు వినతిపత్రం చేస్తున్న శంకర్

దేవునికడపలో ఉన్న తిరుమల తొలిగడప శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయనికి స్థానిక ప్రజలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని టిడిపి నాయకులు ఎద్దుల శంకర్, శ్రీధర్, వెంకటేష్, బాబు, మునికుమార్, శంకర్ రాజా కోరారు. టిటిడి చైర్మన్ బి.కె.నాయుడుకు ప్రభుత్వ విప్ మాధవి ఇచ్చిన లేఖను అందజేశారు. స్పందించిన చైర్మన్ టిటిడి జెఇఒ వీరబ్రహ్మానికి లేఖను సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ టిటిడి ఆధీనంలో ఆలయం ఉండడంతో స్థానికులకు ఎలాంటి ప్రాధాన్యత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రహ్మోత్సవాల సమయంలో, రథసప్తమి, పండుగల సందర్భంగా స్థానికులకు స్వామివారి దర్శనం దక్కడం లేదని చెప్పారు. స్థానికులకు కమిటీ వేసి న్యాయం చేయాలని కోరారు.

12న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-కడప అర్బన్

స్వామి వివేకానంద జన్మదిన, సంక్రాంతి వేడుకల్లో భాగంగా నేషనల్ యూత్ డే పురస్కరించుకుని జిల్లాలోని యువతకు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలో స్థానిక కడప మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 12వ తేదీన ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఇందులో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతి, ప్రశంస పత్రం, మెమోంటో అందజేస్తామని తెలిపారు. జిల్లాలోని 15 నుంచి 29 సంవత్సరాల లోపు ఉన్న యువ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తమ ప్రతిభను మెరుగు పరుచుకోవాలని పేర్కొన్నారు. వివరములకు 9398391912 మొబైల్ నంబర్‌ని సంప్రదించాలని తెలిపారు.

వైసిపి ప్రభుత్వంలోనే అభివృద్ధి

- వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-కమలాపురం టౌన్

రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ చేసిన అభివృద్ధిని తనదిగా చెప్పుకుంటున్నారని తెలిపారు. జగన్ ప్రభుత్వంలో నిలిచిపోయిన అభివృద్ధి కార్యక్రమాలకు ఈరోజు ప్రధానితో శంకుస్థాపన చేయించడం సిగ్గుచేటని ముఖ్యమంత్రి చంద్రబాబుపై విమర్శలు కురిపించారు. రాయలసీమ తర్వాత బాగా వెనుకబడిన ప్రాంతం ఉత్తరాంధ్ర అని ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి జరిగిందంటే ఒక్క రాజశేఖర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డితోనే అని 2014-19 అధికారంలోకి వచ్చిన టిడిపి పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. 2019-24లో వైసిపి ప్రభుత్వం ఉత్తరాంధ్రపై ప్రత్యేక దృష్టి సారించి పారిశ్రామికంగా అక్కడి ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేసిందన్నారు. ఉద్దానంలో కలుషిత నీటి సమస్యతో కిడ్నీ బారిన పడిన ప్రజలకు రూ.700 కోట్లతో ఆసుపత్రి నిర్మించి, అక్కడి ప్రజలకు మంచినీటిని సౌకర్యం కల్పించింది, భోగాపురం ఎయిర్ పోర్ట్, జిల్లాలో మెడికల్ కాలేజ్‌ని నిర్మించి ఆ ప్రాంత విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తెచ్చిన ఘనత జగన్‌దే అని చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయం, అభివృద్ధికి నిధులు విడుదల చేస్తామని ప్రకటన చేపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోల్ల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాజుపాలెం సుబ్బారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ ఉత్తమరెడ్డి, నగర పంచాయతీ అధ్యక్షులు గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

మాట్లాడుతున్న మున్సిపల్ నాయకులు

ప్రజాశక్తి - బద్వేలు

మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కమిటీ అధ్యక్షులు పులి శ్యాంప్రవీణ్ అన్నారు. స్థానిక సిఐటియు పట్టణ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు గత సంవత్సరం నిర్వహించిన 17 రోజుల సమ్మె ముగిసి ఏడాది గడుస్తున్నదని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియో, దహన సంస్కారాలకు రూ.20 వేలు, ఇంజినీరింగ్ కార్మికుల జీతాలపెంపు, సంక్షేమపథకాలు, పర్మినెంట్ కార్మికులకు సరండర్ లీవ్‌లు తదితర హామీలకు వెంటనే జిఒలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం గత ఏడాది సమ్మె ముగిసిన రోజు జనవరి 10వ తేదీ అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని కార్మికులను పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా సమ్మెకాలపు ఒప్పందాల జిఒలు జారీ చేయలేదని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ, ఉన్నతాధికారులను యూనియన్ రాష్ట్ర నాయకత్వం పలు పర్యాయాలు కలిసి విన్నవించినా స్పందన లేదని చెప్పారు. పైగా 2024 జనవరి 24వ తేదీ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కి వెళ్ళిన సిఫార్సుల ఫైళ్ళను టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే సంబంధిత ఫైళ్లను వెనక్కి తెప్పించుకోవడం జరిగిందని, నేటికి ఫైల్స్‌ను పరిశీలించి మరల ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు పంపలేదన్నారు. కార్మికుల రిట్కైర్మెంట్ వయస్సును 62 ఏళ్ళకు పెంచడం లేదని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా 60 ఏళ్ళకే బలవంతంగా రిటైర్‌మెంట్ చేస్తున్నారని, వారి బిడ్డలకు కూడా ఉద్యోగాలు ఇవ్వడంలేదన్నారు. ఈ విధానాలను వెంటనే మానుకోవాలని, ఇంజినీరింగ్ విభాగంలో సుమారు 12 నుండి13 వేల మంది కార్మికులు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, ఇంటి బాడుగలు, కరెంట్ చార్జీలు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో కుటుంబాలు పస్తులతో గడుపుతున్నారని తెలిపారు. గత సమ్మె సందర్భంగా 9 మంది అధికారులతో వేసిన కమిటీ నివేదిక తప్పుల తడకగా ఉన్నదన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు జిఒ 36 ప్రకారం జీతాలు చెల్లించాలని తెలిపారు. మున్సిపాల్టీలలో దశాబ్దాల తరబడి పనిచేస్తున్న ఎన్ఎంఆర్, బదిలీ, కోవిడ్ కార్మికులను మున్సిపల్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్లకు జీతాలు పెంచి ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు, యూనియన్ పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షులు దియ్యాల హరి, ఉపాధ్యక్షులు దియ్యాల దేవమ్మ, గంటా శ్రీనివాసులు, కోశాధికారి కాలువ శివకుమార్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

హామీలను అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గత సమ్మె కాలపు హామీలను అమలు చేయాలని మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు బి.నాగన్న, కార్యదర్శి ఎస్.శేఖర్ కోరారు. ఆ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గత సమ్మె కాలపు ఒప్పందాల జిఒల కోసం ఈనెల 10న జరిగే మున్సిపల్ కార్మికుల రిలే నిరాహార దీక్షను మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టబోతున్నామని తెలిపారు. గతేడాది 17 రోజుల సమ్మె ముగిసి ఏడాది గడుస్తున్నా మున్సిపల్ కార్మికుల సమస్యలు తీరలేదన్నారు. మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ ట్రెజరర్ శివ, కమిటీ సభ్యులు బాలు పాల్గొన్నారు.

13 నుంచి సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శిల్పారామం, డాక్టర్ వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఈ నెల 13 నుంచి సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని శిల్పారామ పరిపాలన అధికారి బి.సుధాకర్ తెలిపారు. స్థానిక ఉలిమెల్ల లేక్‌లో బుధవారం ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమాలు 13నుంచి మూడు రోజులపాటు ఉంటాయన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఇ వెంకట సుబ్బయ్య, ఫీల్డ్ సూపర్వైజర్ ఇస్మాయిల్, సుబ్బారావు, వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

10న ఎద్దుల కొండపై వైకుంఠ దర్శనం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పాపాఘ్ని నది ఒడ్డున ఉన్న శ్రీవృషభాచలేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన ఎద్దుల కొండపై వైకుంఠ దర్శనం ఏర్పాటు చేసినట్లు ఆలయ ఇఒ విశ్వనాథ్‌రెడ్డి, టిడిపి నేత పివి రమణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారు జామున 5 గంటల నుండి తిరుప్పావైతో ఎద్దుల కొండపై ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి వైకుంఠ ద్వారా అనుమతించనున్నట్లు తెలిపారు. భక్తులకు వేంపల్లెలోని మెయిన్ బజార్‌లో ఉన్న శ్రీఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుండి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొండపై తాగునీటి సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

బైక్ అదుపుతప్పి సీనియర్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి - తొండూరు

ద్విచక్ర వాహనం అదుపుతప్పి తొండూరు ఎంపిడిఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు (54) అక్కడికక్కడే మృతి చెందాడు. కార్యాలయంలో విధులు ముగించుకుని బుధవార మధ్యాహ్నం అన్నతి తినేందుకు వస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. తీవ్రంగా గాయపడి శ్రీనివాసులు మృతి చెందాడు.

భార్య, కూతురు హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

భార్య, కూతురును చంపిన నిందితుడ్ని అరెస్టు చేశామని పులివెందుల రూరల్ సిఐ వెంకటరమణ తెలిపారు. బుధవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిందితుడు తుమ్మల గంగాధరరెడ్డి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. రోజూ మద్యం సేవించి తన భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. మద్యం తాగడానికి డబ్బు అడుగ్గా నిందితుడి ఇవ్వకపోవడంతో మీ అంతు చూస్తానని బెదిరించాడు. అర్ధరాత్రి సుమారు 1.00 గంట సమయంలో గంగాధరరెడ్డి తన భార్యతో గొడవపడి ఇంట్లో ఉన్న ఇనుప పైపు తీసుకుని తన భార్య శ్రీలక్ష్మి తలపై గట్టిగా కొట్టగా, కూతురు గంగోత్రి మంచంపై నుండి లేచి అడ్డుపడుతుండగా అదే ఇనుప పైపుతో కూతురు గంగోత్రి తలపై కూడా రెండుమూడు సార్లు బలంగా కొట్టాడు. ఇద్దరూ గట్టిగా అరుస్తూ తల నుండి రక్తం కారుతూ చెరో మంచంపై పడిపోయినట్లు సిఐ తెలిపారు. కొన ఊపిరితో ఉన్న ఇద్దరినీ ఇంట్లో ఉన్న మచ్చుకత్తితో నరికాడు. నిందితుడ్ని బుధవారం మధ్యాహ్నం టి.తుమ్మలపల్లె రోడ్డులో చీనీ తోట వద్ద అరెస్టు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రామచంద్ర, పోలీసులు ఉన్నారు.

వేగం తగ్గించి ప్రమాదాలను అరికట్టండి

వేగం తగ్గించి రోడ్లపై ప్రమాదం జరగకుండా జాగ్రత్త పడాలని పులివెందుల రూరల్ సిఐ వెంకటరమణ అన్నారు. ఇటీవల కాలంలో లింగాల, సింహాద్రిపురం, వేముల మండలాల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం, మైనర్లు వాహనాలు నడపడం వల్ల ఈ ప్రమాదాలు జరగడానికి కారణాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్లు ధరించి వాహనాలను నడిపి ప్రమాదాల నుంచి బయటపడాలన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

- ఐచర్ వాహనాన్ని వదిలేసినట్లు సమాచారం?

ప్రజాశక్తి - వేముల

మండల కేంద్రంలోని మీదిపెంట్ల పంచాయతీలోని మారుమూల గుట్టలోని బక్కన్నగారిపల్లె గ్రామానికి చెందిన బి.వెంకట్ నాయక్ అరటి తోటలోని ప్యాక్‌హౌస్‌లో అక్రమంగా నిల్వ చేసి రవాణాకు సిద్ధం చేస్తుండగా బియ్యాన్ని పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. 4,800 కిలోల రేషన్ బియ్యాన్ని, ఒక ఐచర్ వాహనాన్ని విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో పట్టుకున్నారు. సమాచారం రాక మునుపు ఇంకా పెద్ద మొత్తంలో రవాణా చేసినట్లు తెలుస్తోంది. బుక్కపట్నం మండలం గోపులాపురం తండాకు చెందిన కె.లక్ష్మి ప్రసాద్ నాయక్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి బియ్యాన్ని తమ ఏజెంట్ల ద్వారా పల్లెల నుంచి సేకరించి మీదిపెంట్ల గ్రామపొలంలో డంపింగ్ చేసి రవాణాకు సిద్ధం చేస్తుంటారు. పక్కా సమాచారంతో విజిలెన్స్ సిఐలు శివన్న, నారకుల నారాయణ, ఎఒ బాల గంగాధర్‌రెడ్డి, పులివెందుల ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ సుధీర్ దాడి చేశారు. ఐచర్ వాహనాన్ని, పెద్ద మొత్తంలో రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అయితే రాత్రికి రాత్రే అక్రమ రేషన్ ముఠా అధికారులను మేనేజ్ చేసి పట్టుకున్న ఐచర్ వాహనాన్ని తప్పించారని ఆరోపణలున్నాయి. పట్టుకున్న బియ్యాన్ని అధికారులు పులివెందులోని సివిల్ సప్లయర్స్ గౌడన్‌కు తరలించారు.

రేషన్ కావాలంటే చలికి వణకాల్సిందే..!

- వేకువజాము నుంచి క్యూలో పడిగాపులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రేషన్ కావాలంటే వేకువజాము నుంచి చలికి వణుకుతూ క్యూలో నిలబడాల్సిందే.. పడిగాపులు కాయాల్సిందేనని పట్టణంలోని భాకరాపురం రేషన్ లబ్ధిదారులు వాపోతున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇల్లు, పార్టీ కార్యాలయం ఉన్న ప్రాంతంలోనే ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం తగిన చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. గత నెలలో కూడా రేషన్ దారులు బారులుదీరి వరుసలో నిలబడి రేషన్ తీసుకున్నారు. ఈ నెలలో కూడా అదే పరిస్థితి నెలకొంది. అధికార యంత్రాంగంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై చర్యలు తీసుకోరా అంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు షాపులకు ఒక్క డీలరే ఉండడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందని తెలుస్తోంది. బాకరాపురంలో బుధవారం నుంచి రేషన్ ప్రారంభించారు. ఆ రోజే రేషన్ తీసుకోకపోతే బియ్యం ఒకటే ఇస్తారని, కంది బేడలు, జొన్నలు అయిపోయాయని గతంలో డీలర్లు చెప్పడం వల్ల క్యూలో ఉండి రేషన్ తీసుకోవాల్సిన పరిస్థితి. చలికాలం కావడంతో వృద్ధులు, రోగులు చలికి వణకాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

తెల్లవారుజాము నుంచి రేషన్‌షాపు దగ్గర వేచి ఉన్న లబ్ధిదారులు

ఇళ్లకు ఇబ్బందిలేకుండా పూడికతీత చేపట్టాలి

సిపిఎం నాయకులతో మాట్లాడుతున్న కాలనీవాసులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గోపవరం పంచాయతీ కాలువ కట్టమీద ఇళ్లు వేసుకున్న వారికి ఇబ్బంది లేకుండా పూడిక పని చేపట్టాలి సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. 30ఏళ్ల నుంచి కాల్వకట్ట మీద నివాసం ఉన్న ప్రజలతో కలిసి బుధవారం సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు సిపిఎం నాయకులతో మాట్లాడుతూ తామంతా పేదలమని, కూలీకిపోతేనే బతుకుతామని తెలిపారు. కాలువ పూడిక తీయడానికి ఎలాంటి అభ్యంతరంలేదని, కాలువ మీద వేసుకున్న దారి తొలగిస్తే తాము ఇంట్లో నుంచి బయటికి రావాలంటే ఇబ్బందులకు గురవుతామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ మీద అక్కడక్కడ గ్యాపులు ఉన్నాయి.. వాటి ద్వారా మిషన్లతో పూడిక తీసుకోవాలని సూచించారు. అంతకుమించి ఏమైనా చేయదలుచుకుంటే తాము ఆత్మహత్యలకైనా వెనుకాడబోమన్నారు. తమపై కక్ష పూరితంగా ఈరోజు తొలగించాలని చూస్తే మా గోడు కొట్టుకోక తప్పదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, శారద, బాబు, జాను, రామలక్ష్మి, లత, విమల, కాల్వకట్ట ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చేపల పెంపకం రైతులకు లాభదాయకం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వ్యవసాయంతోపాటు చేపట పెంపకం చేపడితే లాభదాయకమని డిఆర్‌డిఎ పీడీ ఆనంద నాయక్ సూచించారు. ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న వెలుగు కార్యాలయంలో బుధవారం చిలమకూరు గ్రామ రైతులతో అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆనంద నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుకు ప్రతినెల రూ.10వేలు ఆదాయం రావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేస్తోందన్నారు. పిఎంఇజిపి పథకం ద్వారా చేపల పెంపకానికి 90 నుంచి 95 శాతం రుణాలు బ్యాంకుల నుంచి పొందవచ్చని తెలిపారు. ఈ రుణంలో ప్రభుత్వం 35 శాతం రాయితీ, ఒసి పురుషులకు 25 శాతం రాయితీ ఇస్తుందన్నారు. లబ్ధిదారులకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి, అందులో బోరు, విద్యుత్ ఉండాలన్నారు. డిపిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ మండలంలోని చిలుమూరు గ్రామం నాబార్డ్ (వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి కోసం నేషనల్ బ్యాంక్)లో ఎంపికైందన్నారు. ప్రభుత్వ పరిధిలోని అన్ని శాఖల సమన్వయంతో రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఉదయ్ ఆక్వా మేనేజింగ్ డైరెక్టర్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ చేపలు పెంపకం యూనిట్ ఏర్పాటు చేసుకునేందుకు రూ.4.40వేలు అవుతుందన్నారు. ప్రత్యామ్నాయ ఉపాధిగా రైతులకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎపిఎం జగదీశ్వరి, ఎఒ శ్రీకాంత్‌రెడ్డి, ఎఫ్ఇఒ ఇబిలు, చిలమకూరు రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న రైతులు, అధికారులు

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

శ్రీచైతన్య పాఠశాలలో..

ప్రజాశక్తి - వేంపల్లె

సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో రంగవల్లి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్సాహంగా బాలి కలు, మహిళలు పాల్గొన్నారు. ముందస్తు సంక్రాంతి సంబరాలను బుధవారం కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి ప్రారభించారు. సంక్రాంతికి చెందిన పొంగళ్లు పొంగించే ముగ్గులను వేసేందుకు బాలికలు సంప్రదాయ దుస్తులతో వచ్చారు. సంప్రదాయ ముగ్గులతో పాటు, ఆధునిక శైలిలో రూపొందించిన డిజైన్లు కలిగిన ముగ్గులను వేసి అందరిని ఆకట్టుకున్నారు. ప్రతి ముగ్గులో పరిశ్రమ, కళాత్మకత స్పష్టంగా ప్రతిబింబించేలా విద్యార్థులు వేశారు. ముగ్గుల పోటీల ఏర్పాటుతో పాఠశాల ఆవరణ మహిళలు, బాలికలతో కళకళలాడింది. అనంతరం ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపిన మహిళలకు, బాలికలకు బహు మతులు అందజేశారు. వీరిని పాఠశాల డైరెక్టర్లు చేతన్ రెడ్డి, శ్రీచైతన్యరెడ్డి అభినందించారు.

నాగార్జున మోడల్ స్కూల్‌లో..

కడప అర్బన్ : మారుతీ నగర్‌లో ఉన్న నాగార్జున మోడల్ స్కూల్లో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చారు. విద్యాసంస్థల చైర్మన్ ఎం.శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్లు ఎం.శ్రీదేవి, భానేష్ సాయిరెడ్డి సంబరాలను ప్రారంభించారు. రంగవల్లులు, గొబ్బెమ్మలుతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ పండుగలు ఐక్యతకు చిహ్నాలని పేర్కొన్నారు. చిన్నారులపై భోగి పళ్లు వేసి ఆశీర్వదించారు. కొందరు విద్యార్థులు హరిదాసు, గంగిరెద్దు వేషాలు ధరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీరం పాఠశాలలో.. పోటీల్లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

బీరం పాఠశాలలో..

ఖాజీపేట : మండలం పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను బుధవారం పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. చిన్నారుల కోలాటం, హరిదాసు కీర్తనలు, భోగి మంటలు, పిండి వంటల ప్రదర్శన తదితర ప్రత్యేక కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం పాఠశాల కరెస్పాండంట్ బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుత తారానికి తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకునేలా, చిన్నతనం నుండే విలువలు పెంపొందించేలా చేయడానికే సంక్రాంతి ముందస్తు సంబరాలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్సన్ సరస్వతమ్మ, డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కాలేజీ ప్రిన్సిపల్ హేమచందర్, అధ్యాపకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

మడూరు సచివాలయంలో బుధవారం గ్రామపంచాయతీ అభివృద్ధి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఇందుకు సచివాలయ సిబ్బంది, అధికారులు సహకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో అన్నవరం పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసులును ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆ మేరకు బుధవారం బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లోకేశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో ప్రయోజనం : ఎఒ

ప్రజాశక్తి - చాపాడు

ఆరుతడి పంటలు సాగు చేసే రైతులు విత్తనశుద్ధి చేపట్టడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. మండలంలోని అనంతపురం, తుమ్మలపాడు, ఎన్ ఓబాయపల్లె, అయ్యవారిపల్లె గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రబీలో వేసిన పంటకు జనవరి 15 వరకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించవచ్చున్నారు. జొన్న పంటను సందర్శించి పంట కాలంలో పాటించవలసిన జాగ్రత్తలను సూచించారు. జొన్న పంటను కత్తెర పురుగు నివారణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమం లో విఎఎ భార్గవి, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి సర్వే

సింహాద్రిపురం : మండలంలోని గురజాల-వెన్నపూసపల్లె మార్గంలో తార రోడ్డు నిర్మాణానికి భూములను అధికారులు సర్వే చేశారు. బుధవారం తహశీల్దార్ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు సర్వేయర్ శ్రీనివాసులు సర్వే నిర్వహించారు. దాదాపు ఎనిమిది కిలోమీటర్ల మేర తార రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలం కొరత కారణంగా కొన్ని నెలల నుంచి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. ఇటీవల రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులను స్థానిక ప్రజలు కోరడంతో సర్వే చేపట్టారు. రోడ్డు పూర్తయితే తాడపత్రికి వెళ్లాలంటే చాలా దగ్గర మార్గం అవుతుందని గురజాల ప్రజలు చెబుతున్నారు.

IN THE COURT OF THE HON'BLE III ADDL JUNIOR CIVIL JUDGE, KADAPA

O.S.No. 410 /2024

Union Bank Of India, Rep. by its Assistant Manager, Kadapa. **...Plaintiff**

Vs

D3) P.Rajeswari, W/o, P.Ravi, R/o D.no. 20/96, Aakula veedi street, Kadapa city, Y.S.R Dist.
D8) D.Vajramma, W/o, Eswaraiah,R/o, D.no, 16/871, masapet Kadapa city, Y.S.R Dist.
D9) P.Sujatha, W/o, Late, Yesanna, R/o, D.no. 16/1211- B, masapet Kadapa city, Y.S.R Dist. **...Defendants**

NOTICE

The above referred the plaintiff bank has filed suit for recovery in O.S No. 410/2024, in the above Hon'ble court and same is posted for your appearance on 20.01.2025, at 10:30 A.M, if you're not appear before the Hon'ble Court, the matter will be decide in your absence.

//By Order of the Hon'ble Court//
G.VENKATESWARA REDDY,
Advocates,
KADAPA

మహారాజశ్రీ గౌరవనీయులైన 1వ అదనపు జిల్లా జడ్జ్ కోర్ట్, కడప

G.O.P. 65/2024

Shaik Nazira, W/o. Late Shaik Azhar Ali, Muslim, age 50 Years, working as Teacher in Nagarjuna Model School, Kadapa, resident of D.No. 7/486, Mochampeta, Kadapa, presently residing at D.No. 8/202-2-6 Upstairs, Bismillah Nagar, Near Al Farhan Islamic School, Kadapa City – 516001, Mob: 9381584188. **...Petitioner**

Vs

Nil. **...Respondent**

జనరల్ నోటీస్

ఇందుమూలంగా తెలియజేయడమేమనగా, పై కేసులో పిటిషనర్ తన మైనర్ కూతురు అయిన షేక్ అమీనా, వయసు 12 సంవత్సరములు తరపున, క్రింద షెడ్యూలు ఆస్తిలో మైనరు వాటాను అమ్ముటకు కోర్ట్ వారి అనుమతి కొరకు దాఖలు చేసి ఉన్నారు. ఇందుకు ఎవరికైనా ఆక్షేపనలు ఉన్న యెడల 21.01.2025వ తేదీన కోర్ట్ వారి ముందు హాజరయ్యి, తెలుపుకోవలయును, లేనియెడల ఆక్షేపణలు లేవని భావించి, గౌరవనీయులైన కోర్ట్ వారు తదుపరి చర్యలు తీసుకొనబడును.

షెడ్యూలు

కడప జిల్లా, కడప సబ్-జిల్లా, కడప నగరం, 16వ వార్డ్, గౌస్ నగర్, ఇంటి నెంబరు 16/374- 15-1, విస్తీర్ణం Ac. 0.01 1/2 సెంటు, తూర్పు - పడమర ఇరువైపుల 20 1/2 లింకులు, ఉత్తరం, దక్షిణం తూర్పు వైపున 74 లింకులు, పడమర వైపున 73 లింకులు, మొత్తం విస్తీర్ణం 72.93 చదరపు గజాలు.

//By Order of the Court//
కె. విజయ్ క్రిష్ణ, B.A.,LL.B.,
పిటిషనర్ తరపున న్యాయవాది,
సెల్: 9959887870..

పోటీలు ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

'పుట్టా' ప్రీమియర్ లీగ్ టి-10 క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం : మండలంలోని నాగిశెట్టిపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కానాల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌పై అభిమానంతో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం ప్రీమియర్ లీగ్ టి-10 మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను టిడిపి మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, కానాల మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలో తల బడేందుకు 30టీంలు వచ్చాయి. మొదటి బహుమతిగా రూ.50,000 (కానాల మల్లికార్జునరెడ్డి), రెండో బహుమతిగా రూ.30,000(చెన్నుపల్లి సుబ్బారెడ్డి), మూడో బహుమతి రూ.10,000(టిడిపి మండల నాయకులు ఎల్లటూరు సాంబశివారెడ్డి) స్పాన్సర్ చేయనున్నారు. బహుమతితోపాటు విజేత టీంలకు ట్రోఫీ కూడా అందజేయనున్నారు. ప్రారంభోత్సవానికి తెలుగుదేశం పార్టీ నాయకులు ఎత్తపు ఈశ్వర్‌రెడ్డి, సుధాకర్, పూజ శివయ్య, నాయుడు, పుటాల శివ, మండల తెలుగు యువత అధ్యక్షులు సన్నపురి శ్రీను పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు) : యువజన క్రీడ మంత్రిత్వ శాఖ నెహ్రూ కేంద్రం, అమ్మ సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో మేథా డిఫెన్స్ కళాశాలలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఈ వాలీబాల్ టోర్నమెంట్‌లో వివిధ మండలాల నుంచి 12 టీముల సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేథా విద్యాసంస్థల చైర్మన్ చెన్నంశెట్టి నరసింహులు, ఎస్ఎల్ఆర్ హాస్పిటల్ అధినేత మూలే రామఅనిల్ కుమార్‌రెడ్డి విచ్చేశారు. విజేతలకు మెడల్, ట్రోఫీని అందజేశారు. విజేతలుగా నిలిచిన వారు ఈనెల 13న జరిగే జిల్లాస్థాయిలో పాల్గొనుటకు అర్హులని నెహ్రూ కేంద్ర యువ అధికారి మణికంఠ తెలిపారు. కార్యక్రమంలో అమ్మ సేవా సమితి సభ్యులు శివశంకర్, సతీష్, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ జయంతి

ప్రజాశక్తి - వేంపల్లె : విశ్వ నిర్మాణ శాస్త్రవేత్త స్టీఫెన్ విలియం హాకింగ్ జయంతి వేడు కలను ఘనంగా నిర్వహించినట్లు జనవిజ్ఞానవేదిక జిల్లా గౌరవాధ్యక్షులు పొన్నతోట గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్టీఫెన్ హాకింగ్ జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక నారాయణ రెసిడెన్షియల్ స్కూలు ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీఫెన్ విలియం హ్యాకింగ్ శాస్త్రవేత్త బ్లాక్ హెూల్స్ కృష్ణ బిలాలకు సంబంధించి అనేక అంశాలకు పరిశోధనలు చేశారని తెలిపారు. ఆయన గొప్ప సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్త అని కొనియాడారు. ఆయన రాసిన కాలం సంక్షిప్త కథ అనే పుస్తకం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించిందన్నారు. మరణించే సమయానికి ఆయన క్రైమ్ బ్రిడ్జి విశ్వ విద్యాలయంలోని సెంటర్ ఫర్ కాస్మాలజీ రీసెర్చ్ డైరెక్టర్ గా పని చేశారన్నారు. జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బయన్న, పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి, ప్రిన్సిపల్ మహాలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రవిశంకర్‌కు పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి - చాపాడు : నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో విశాఖపట్నంలో 5 రోజులపాటు నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో మండల పరిధిలోని రాజుపాలెంకు చెందిన రవిశంకర్‌కు పురస్కారం ప్రదానం చేశారు. కడప జిల్లా నుండి 27 మంది యువ బృందంతో విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమానికి వెళ్లానని రవి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వికశిత భారత్ అంశంపై ప్రసంగించడంతో అవార్డును పొందినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వరరావు, ఐఆర్ఎస్ అధికారి రవికిరణ్ చేతుల మీదుగా మెమెంటో, సర్టిఫికెట్ అందుకున్నారు.

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో నిద్ర మత్తులో మురుగు కాలువ పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు అందించిన వివరాలు మేరకు.. పల్లవోలు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు(54) ఇంటి ఎదురుగా ఉన్న అరుగుపై నిద్రించాడు. నిద్రలో ప్రమాదవశాత్తూ పక్కనున్న మురుగు కాలువలో పడిపోయాడు. గుర్తించిన స్థానికులు వెంకటేశ్వర్లును గుర్తించి బయటకు తీసి వైద్యం చేయించారు. సిపిఆర్ చేసినా ఫలితం లేకపోవడంతో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వెంకటేశ్వర్లు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మద్యం సేవించి ఉండడంతో ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెంకటేశ్వర్లు ఆర్‌టిసి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

30 మంది ట్రిపుల్‌ఐటి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో విద్యా భ్యాసం చేస్తున్న ఇ-4కు చెందిన 30 మంది విద్యార్థులకు ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చినట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను బుధవారం కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ అభినందించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో నిర్వహించిన ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలో ఉప్పా టివి కంపెనీలో, ఎవరెస్ట్ ఇంజినీరింగ్ కంపెనీలో, వేటూ న్యూస్ కంపెనీల్లో ఉద్యోగాలకు విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ వివరించారు. ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటిలో విద్యార్థులకు ఉద్యోగాలు రావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేటర్ వినోద్, సుందర్ పాల్గొన్నారు.

బాలికలకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 9, 10, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు బుధవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు-ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ సలహాదారులు రాజోలి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల పట్ల గౌరవభావం కలిగించేందుకు, వారి ఆశయాలకు అనుగుణంగా తయారయ్యేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. నవ సమాజ నిర్మాణం కావాలంటే బాధ్యత కలిగిన పౌరుల అవసరం తప్పనిసరి అని పేర్కొన్నారు. బాలికలకు కావాల్సిన మనోధైర్యాన్ని ఇవ్వడానికి స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలు చేపట్టామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE PRL. SENIOR CIVIL JUDGE KADAPA

Creditor I.P. No. 72 of 2024

Between:
Chennamsetty Chowdeswaraiah son of Ramaiah, Hindu, aged 50 years, Business, residing at D.No. 13/105AB,B.K.M. Street, Kadapa City, Kadapa District. **...Petitioner**

And

1. Smt. Gontimukkala Supriya wife of late Gontimukkala Lokanadh aged about 27 years, Hindu, working as a Asha Worker, Nasanthapuram village, Pedda Cheppali post, Kamalapuram Mandal, Kadapa District.
2. Kethaboina Dasthagiramma wife of Srenivasulu, Hindu, House wife, aged 48 years, residing at D.No.69/94,Alankhanpalli, Kadapa City, Kadapa.
3. Polu Bala Anki Reddy son of Polu Konda Reddy, aged 43 years, Hindu, kapu, business & cultivation, residing at Kethavaram village, Chapadu Mandal, Kadapa District. **...Respondents**

GENERAL PUBLIC NOTICE

The above named petitioner filed the above Creditor I.P. praying the Hon'ble Court to declare the estate of the deceased G Loknadham in the hands of the first respondent and also for annulment of the registered documents dated 22-04-2022 and 19-11-2022 which stands in the name of the 2nd and 3rd respondent respectively. If any person or persons have any objection, appear on 28-01-2025 at about 10.30 A.M. before the above named Hon'ble Court either in person or through their counsels. Failing which the matter will be decided as exparte.

//By Order of the Court//
N.V. SIVA REDDY
M.V. BALI REDDY
Advocates, KADAPA